భాగ్యనగరంలో బాలకృష్ణ హంగామా

ఓ వైపు సినిమాలు, మరోవైపు రాజకీయాలు, ఇంకోవైపు కేన్సర్ హాస్పిటల్.. క్షణం తీరిక లేకుండా గడుపుతున్నారు బాలకృష్ణ. మూడు బాధ్యతల్నీ సమర్థవంతంగా నెరవేరుస్తున్నారనడానికి ఆయా రంగాల్లో ఆయన విజయాలే నిదర్శనం. ఏపీలో ఎన్నికల వేడి మొదలైంది. వచ్చే నెల నుంచి బాలకృష్ణ తన నియోజకవర్గం హిందూపురంలో బిజీబిజీ. అందుకే.. బాబీ దర్శకత్వంలో చేస్తున్న 'ఎన్‌బీకే 109' షూటింగ్‌ను చకచకా పూర్తిచేసేపనిలో ఉన్నారు బాలయ్య. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ 30శాతం పూర్తిచేసుకుంది. ప్రస్తుతం హైదరాబాద్ అన్నపూర్ణ స్టూడియోస్‌లో వేసిన భారీ సెట్‌లో ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. బాలయ్యపై కీలక సన్నివేశాలతోపాటు ఓ భారీ యాక్షన్ ఎపిసోడ్‌ని కూడా ఈ సెట్‌లోనే తెరకెక్కిస్తున్నారు దర్శకుడు కె.ఎస్.రవీంద్ర(బాబీ). వచ్చే నెల నుంచి బాలకృష్ణ అందుబాటులో ఉండరు గనుక, ఆ నెలలో ఆయన లేని సన్నివేశాలు చిత్రీకరిస్తారని సమాచారం. దానికోసం మరో షెడ్యూల్ కూడా ప్లాన్ చేశారు బాబీ. ఎట్టిపరిస్థితుల్లో రానున్న దసరాకి ఈ సినిమాను విడుదల చేయడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. దుల్కర్ సల్మాన్ కీలక పాత్రలో నటించనున్న ఈ చిత్రంలో బాబీడియోల్ విలన్‌గా నటిస్తున్న విషయం తెలిసిందే. త్రిష, మీనాక్షి చౌదరి, శద్ధాశ్రీనాథ్ కథానాయికలుగా నటిస్తున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. అలాగే ఊర్వశీ రౌతాలా కూడా ఇందులో ప్రత్యేక పాత్ర పోషిస్తున్నట్టు తెలిసింది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే.

రీమేక్ సినిమాకు 'సర్ఫిరా' టైటిల్



అక్షయ్‌కుమార్

అక్షయ్‌కుమార్, రాధిక మదన్ జంటగా నటించిన తదుపరి చిత్రానికి ఎట్టకేలకు టైటిల్ ఖరారైంది. సూర్య నటించిన 'సూరరై పొట్రు'కు రీమేక్‌గా రూపొందించిన ఈ సినిమాకు 'సర్ఫిరా' అనే పేరు పెట్టారు. కేప్ ఆఫ్ గుడ్ ఫిల్మ్స్, 2డి ఎంటర్‌టైన్‌మెంట్, అబండంటియా ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై సుధా కొంగర ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ఆమె గతంలో 'ఇరుధి సుత్రు' (తమిళం), 'సాలా ఖదూస్' (హిందీ)తోపాటు తెలుగులో వచ్చిన 'గురు' చిత్రాలకు దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో పరేష్ రావల్, సీమా బిశ్వాస్ కూడా కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా జూలై 12న విడుదల కానున్నట్లు అక్షయ్ కుమార్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా ప్రకటించారు. ఈ చిత్రానికి కథా రచన సుధ, షాలిని ఉషాదేవి చేశారు. సంగీతం: జి.వి.ప్రకాశ్ కుమార్, నిర్మాతలు: అరుణా భట్టియా, సూర్య, జ్యోతిక, విక్రమ్ మల్హోత్రా.

వాస్తవాల్ని చూపించే ప్రయత్నం చేశాం

దాసరి కిరణ్ కుమార్, రామ్‌గోపాల్‌వర్మ

ఏపీ ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్ రెడ్డి జీవితంలో జరిగిన సంఘటనల నేపథ్యంలో ప్రముఖ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ 'వ్యూహం', 'శపథం' చిత్రాలను నిర్మించిన విషయం తెలిసిందే. రామదూత క్రియేషన్స్ పతాకంపై దాసరి కిరణ్‌కుమార్ నిర్మించారు. ఈ సినిమాల్లో అజ్మల్, మానస ముఖ్య పాత్రల్ని పోషించారు. 'వ్యూహం' ఈ నెల 23న, 'శపథం' మార్చి 1న ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. మంగళవారం ట్రైలర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా రామ్‌గోపాల్‌వర్మ మాట్లాడుతూ 'సెన్సార్ అనేది ఔట్ డేటెడ్ వ్యవస్థ. ఏ కథ తీసినా వాళ్లకు అభ్యంతరాలుంటాయి. ఈ సినిమాలో కొన్ని సీన్స్ తీసివేశారు. అయినా కథలోని ఎమోషనల్ కంటెంట్ మిస్ కాలేదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 ప్రకారం ప్రతి ఫిలిం మేకర్‌కు వాస్తవ ఘటనలను తన కోణంలో చూపించే అధికారం ఉందని హైకోర్టు మాకు ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొంది. వై.యస్.రాజశేఖర్ రెడ్డి మృతి నుంచి వై.యస్.జగన్ ప్రమాణ స్వీకారం వరకు 'వ్యూహం' కథ ఉంటుంది. జగన్ సీఎంగా ప్రమాణ స్వీకారం నుంచి చంద్రబాబు జైలుకు వెళ్లేవరకు 'శపథం' కథలో చూపిస్తున్నాం' అన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని 500 థియేటర్లలో ఈ చిత్రాలను విడుదల చేయబోతున్నామని నిర్మాత దాసరి కిరణ్‌కుమార్ తెలిపారు.

జాతీయ అవార్డుల్లో మారిన పేర్లు

ఈ ఏడాది ప్రదానం చేయనున్న 70వ జాతీయ చలన చిత్ర అవార్డులకు సంబంధించిన రెండు క్యాటగిరీల పేర్లు మార్చుతూ కమిటీ నిర్ణయం తీసుకుంది. ఇందిరాగాంధీ పేరు మీద ఇచ్చే ఉత్తమ తొలి చిత్ర దర్శకుడి అవార్డుతో పాటు, నర్గిస్‌దత్ జాతీయ సమైక్యతా అవార్డుల పేర్లను మార్చుతున్నట్లు నేషనల్ అవార్డ్స్ కమిటీ పేర్కొంది. ఈ రెండు అవార్డుల్లో ఇందిరాగాంధీ, నర్గిస్‌దత్ పేర్లను తొలగించారు. నర్గిస్‌దత్ ఉత్తమ జాతీయ సమైక్యతా చిత్రం అవార్డు ఇకపై...'జాతీయ, సామాజిక, పర్యావరణ విలువలను పెంపొందించేందుకు కృషి చేసిన ఉత్తమ చిత్రం' పేరుతో ప్రదానం చేయబడుతుంది. ఇందిరాగాంధీ ఉత్తమ తొలి చిత్ర దర్శకుడి అవార్డు పేరును 'బెస్ట్ డెబ్యూ ఫిల్మ్ డైరెక్టర్'గా మార్చారు. ఇందిరాగాంధీ పేరు మీద అవార్డును 1984లో, నర్గిస్‌దత్ జాతీయ సమైక్యతా చిత్రం అవార్డును 1965లో ప్రవేశపెట్టారు. తాజాగా ఈ అవార్డుల పేర్లను మార్చుతూ జాతీయ అవార్డుల కమిటీ తీసుకున్న నిర్ణయం చర్చనీయాంశంగా మారింది.

జపాన్‌లో బిజీ బిజీ..

ఆ మధ్య సినిమాలకు కాస్త బ్రేక్‌నిచ్చిన అగ్ర కథానాయిక సాయిపల్లవి ప్రస్తుతం వరుస చిత్రాలతో బిజీగా మారింది. ప్రస్తుతం ఈ భామ జపాన్‌లో తన తొలి హిందీ సినిమా షూటింగ్‌లో బిజీగా గడుపుతున్నది. బాలీవుడ్ అగ్ర హీరో అమీర్‌ఖాన్ తనయుడు జునైద్ ఖాన్‌తో కలిసి సాయిపల్లవి ఓ చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం జపాన్‌లోని సపోరోలో షూటింగ్ జరుగుతున్నది. అక్కడ జరిగే సంప్రదాయ మంచు పండగ నేపథ్యంలో కొన్ని సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా సెట్‌లోని కొన్ని స్టిల్స్ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. సపోరోలో షూటింగ్ జరుపుకుంటున్న తొలి చిత్రమిదే కావడం విశేషం. సునీల్‌పాండే దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని అమీర్‌ఖాన్ స్వీయ నిర్మాణ సంస్థ నిర్మిస్తున్నది. ఈ సినిమాతో పాటు నితీష్ తివారి తెరకెక్కించబోతున్న 'రామాయణ' చిత్రంలో సాయిపల్లవి.. సీత పాత్రలో నటించబోతున్నది. తెలుగులో ప్రస్తుతం నాగచైతన్య సరసన 'తండేల్'లో నటిస్తున్నది సాయిపల్లవి.

రాజేశ్ దండా

ఈ సినిమాకు ఉన్న క్రేజ్‌కి అదే నిదర్శనం

'కొత్త కంటెంట్‌తో, కొత్త జానర్‌లో సినిమా చేస్తే తప్పకుండా విజయం సాధిస్తుందని నా నమ్మకం. అందుకే సినిమా నిర్మించాలి అనుకున్నప్పుడు భిన్నమైన కథ కోసం చూశాను. వి.ఐ.ఆనంద్ చెప్పిన కథ కొత్తగా అనిపించింది. విజయంపై సంపూర్ణ నమ్మకంతో ఈ సినిమా చేశాం. విడుదలకు ముందే నిర్మాతగా అన్ని విధాలుగా సంతోషంగా ఉన్నాను.' అన్నారు నిర్మాత రాజేశ్ దండా. హాస్య మూవీస్ పతాకంపై ఆయన నిర్మించిన చిత్రం 'ఊరుపేరు భైరవకోన'. సందీప్‌కిషన్, కావ్యథాపర్, వర్ష బొల్లమ్మ ప్రధానపాత్రధారులు. వి.ఐ.ఆనంద్ దర్శకుడు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై అనిల్ సుంకర ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఈ నెల 16న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాత విలేకరులతో ముచ్చటించారు. 'ప్రీమియర్ షోస్ అన్నీ ఫుల్ అయ్యాయి. ఈ సినిమాకు ఉన్న క్రేజ్‌కి అదే నిదర్శనం. భైరవకోన అనే ఊర్లో జరిగే ఊహించని సంఘటనల నేపథ్యంలో ఈ సినిమా కథ సాగుతుంది. గరుడపురాణంలో మిస్ అయిన పేజీలకి, ఈ కథకి వున్న లింక్ చాలా ఆసక్తికరంగా ఉంది. 47 నిమిషాల అద్భుతమైన సీజీ వర్క్ ఈ సినిమాకు ప్రధాన బలం. ప్రేక్షకులకు గొప్ప థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా ఇది' అని రాజేశ్ దండా చెప్పారు. అనిల్ సుంకర విలువైన సూచనలు ఈ సినిమాకు చాలా హెల్ప్ అయ్యాయని, సందీప్ కిషన్ చాలా కష్టపడ్డాడని, సినిమాకు చాలా హెల్ప్ అయ్యాడని, మా సంస్థకి నంబర్‌వన్ సినిమా అవుతుందని నమ్మకం ఉందని ఆయన పేర్కొన్నారు. సాంకేతికంగా అద్భుతంగా ఉండే ఈ సినిమాలో శేఖర్‌చంద్ర సంగీతం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని నిర్మాత తెలిపారు. అల్లరి నరేశ్‌తో 'బచ్చల మల్లి' సినిమా చేస్తున్నామని, అలాగే కిరణ్ అబ్బవరంతో కూడా ఓ సినిమా ఉంటుందని ఆయన చెప్పారు.

సారా అలీఖాన్

కరణ్ జోహార్-సారా సినిమా నేరుగా ఓటీటీలోకి

సారా అలీఖాన్ కీలక పాత్రలో కరణ్ జోహార్ నిర్మించిన తాజా చిత్రం 'ఏ వతన్ మేరే వతన్'. ఇమ్రాన్ హష్మి, సచిన్ ఖేడ్కర్, అభయ్ వర్మ, స్పర్ష్ శ్రీవాత్సవ, అలెక్స్ ఓ నేలి, ఆనంద్ తివారీ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. కణ్ణన్ అయ్యర్ దర్శకత్వం వహించిన ఈ సినిమా నేరుగా ఓటీటీ వేదికగా విడుదల కానుంది. ఈ చిత్రాన్ని మార్చి 21 నుంచి స్ట్రీమింగ్ చేయనున్నట్లు తెలుపుతూ అమెజాన్ ప్రైమ్ గ్లింప్స్‌ను ఇంటర్నెట్‌లో విడుదల చేసింది. భారతదేశ చరిత్రలో ఇప్పటిదాకా ప్రస్తావించని సరికొత్త అధ్యాయాన్ని ఈ సినిమా ద్వారా ఆవిష్కరించనున్నట్లు అమెజాన్ ప్రైమ్ ఈ వీడియో ద్వారా తెలియజేసింది. స్వాతంత్ర్యోద్యమ కాలంలో అండర్ గ్రౌండ్ రేడియో స్టేషన్‌ను ఏర్పాటు చేయడం ద్వారా ఉద్యమకారుల్లో ఉత్సాహాన్ని నింపిన ఓ మహిళ కథతో ఈ సినిమాను తెరకెక్కించారు. ఉషా మెహతా జీవిత కథ నుంచి స్ఫూర్తి పొంది ఈ చిత్రాన్ని తీర్చిదిద్దినట్లు తెలుస్తున్నది. 'స్వాతంత్ర్య పోరాటంలో రేడియో కీలక పాత్ర పోషించిందని, అలాంటి ఇతివృత్తంతో రూపొందిన ఈ చిత్ర స్ట్రీమింగ్‌ను ప్రపంచ రేడియో దినోత్సవం సందర్భంగా మార్చి 21న ప్రారంభిస్తుండటం సంతోషంగా ఉందని కరణ్ జోహార్ ధర్మాటిక్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ పేర్కొంది.

హ్యూమా ఖురేషి

మాయా తంత్రాలతో నిండిన 'భ్రమయుగం'



వైవిధ్యమైన చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు ఎంతగానో చేరువయ్యారు మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి. ఆయన మరో వైవిధ్యమైన సినిమా 'భ్రమయుగం'. రాహుల్ సదాశివన్ దర్శకత్వం వహించిన ఈ మలయాళ హారర్ థ్రిల్లర్ జానర్‌ను నైట్ షిఫ్ట్ స్టూడియోస్ పతాకంపై చక్రవర్తి రామచంద్ర, ఎస్.శశికాంత్ నిర్మించారు. ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ వేడుక ఇటీవల అబుదాబిలో నిర్వహించారు. తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో ట్రైలర్‌ను ఆవిష్కరించారు. చాలా కాలం తర్వాత బ్లాక్ అండ్ వైట్ ఫార్మాట్‌లో రూపొందిన ట్రైలర్ కొత్త అనుభూతిని ఇస్తోంది. ఈ సినిమా కథ కేరళలో మాయాతంత్రంతో నిండిన యుగంలో నడుస్తుంది. ఒక గాయకుడి జీవితంలో చోటుచేసుకున్న అనూహ్య ఘటనల నేపథ్యంలో రూపొందించిన ఈ చిత్రం మలయాళ వెర్షన్ గురువారం (రేపు) విడుదల కానుంది. త్వరలోనే మిగతా భాషల్లోనూ విడుదల చేస్తామని మేకర్స్ వెల్లడించారు. ఈ చిత్రానికి కెమెరా: షెహనాద్ జలాల్, సంగీతం: క్రిస్టో జేవియర్.

'యానిమల్' చూస్తే అలా అనిపించింది

'హాలీవుడ్ చిత్రం 'ది వూల్ఫ్ ఆఫ్ వాల్ స్ట్రీట్' చూస్తే ఎలా అనిపిస్తుందో 'యానిమల్' చూస్తే అలా అనిపించింది. ఇది భిన్నమైన చిత్రం. కథ, కథనం, సంగీతం.. ఇలా అన్ని విషయాల్లో ఈ సినిమా నాకు నచ్చింది' అంటున్నది బాలీవుడ్ భామ హ్యూమా ఖురేషి. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె సందీప్‌రెడ్డి వంగా 'యానిమల్' సినిమా గురించి ఆసక్తికరమైన కామెంట్లు చేసింది. 'యానిమల్' చూస్తూ బాగా ఎంజాయ్ చేశాను. అలాంటి సినిమాల్లో నటించాలనేది నా కోరిక. ఆ అవకాశం వస్తే మాత్రం వదులుకోను. నేనైతే అన్ని రకాల సినిమాల్లో నటిస్తా.. చూడ్డం, చూడకపోవడం ప్రేక్షకుల ఇష్టం. సినిమా సమాజాన్ని పూర్తిగా ప్రభావితం చేస్తుందంటే నేను నమ్మను. ఎన్నో ప్రభావవంతమైన సినిమాలొచ్చినా సమాజంలో వచ్చిన మార్పేమీ లేదు. అందుకే.. సినిమాపై వచ్చే ప్రశంసల్నీ, విమర్శల్నీ నేను పట్టించుకోను. ప్రేక్షకులు చూస్తున్నంత కాలం సినిమాలు వస్తూనేవుంటాయి' అంటూ చెప్పుకొచ్చింది హ్యూమా ఖురేషి.

'జస్ట్ ఏ మినిట్' ప్రేమగీతం

అభిషేక్ పచ్చిపాల, నజియా ఖాన్, జబర్దస్త్ ఫణి, సతీశ్ సారిపల్లి ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'జస్ట్ ఏ మినిట్'. రెడ్ స్వాన్ ఎంటర్‌టైన్‌మెంట్, కార్తీక్ ధర్మపురి ప్రెజెంట్స్ సంయుక్తంగా నిర్మించాయి. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఈ సినిమా నుంచి రెండో పాటను చిత్ర యూనిట్ మంగళవారం విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ.. ఎన్నో అద్భుతమైన పాటలు పాడిన హేమంత్ గారి గాత్రం ఈ సాంగ్‌కు ప్లస్ అయిందని, రాంబాబు గోసాల గారి సాహిత్యం యువతను అలరిస్తుందని చెప్పారు. అతి త్వరలో ట్రైలర్‌ను విడుదల చేయబోతున్నామని తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: అమీర్, సంగీతం: ఎస్.కె.భాజీ, నిర్మాతలు: అర్షద్ తన్వీర్, డాక్టర్ ప్రకాశ్ ధర్మపురి, దర్శకత్వం: పూర్ణస్ యశ్వంత్.

భాను, అఖిలన్, రవిశంకర్, వాణీ విశ్వనాథ్ తదితరులు

రాజధాని రైతుల కన్నీళ్లకు సమాధానం

'రాజధాని కోసం స్వచ్ఛందంగా వేల ఎకరాలు ఇచ్చి హేళన పాలై, క్షోభకు గురైన వేలాది రైతుల ఆవేదన, పోరాటాల స్ఫూర్తితో ఓ సినిమా చేయాలని అనుకున్నాను. రాజధాని రైతుల కన్నీళ్లకు సమాధానంగా తెరకెక్కిన సినిమా ఇది. ఇది ఏ పార్టీకీ వ్యతిరేకం కాదు. ఇటీవల విడులైన ట్రైలర్‌కి అద్భుతమైన స్పందన వస్తున్నది. సినిమాకు దానికి మించిన స్థాయిలో ఉంటుంది' అన్నారు నిర్మాత కంఠమనేని రవిశంకర్. ఆయన నిర్మించిన చిత్రం 'రాజధాని ఫైల్స్'. భాను దర్శకుడు. అఖిలన్, వీణ, వినోద్ కుమార్, వాణీవిశ్వనాథ్ ప్రధాన పాత్రధారులు. ఈ నెల 15న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిర్మాత మాట్లాడారు. ఇది పొలిటికల్ సినిమా కాదని, రైతుల ఆవేదనను తెలిపే సినిమా అని నటుడు వినోద్‌కుమార్ అన్నారు. ఉద్వేగపూరితమైన సినిమాలో భాగం కావడం చాలా ఆనందంగా ఉందని వాణీవిశ్వనాత్ సంతోషం వెలిబుచ్చారు. రాజధాని రైతులు కూడా ఈ సినిమాలో కనిపిస్తారు. వారి ఆవేదనను ఆవిష్కరించడమే లక్ష్యంగా తీసిన సినిమా ఇది. మాది జాతీయ జెండా లాంటి సినిమా. అందరికీ ఉపయోగపడే సినిమా. ప్రోత్సహించిన నిర్మాతకు కృతజ్ఞతలు' అని దర్శకుడు చెప్పారు. ఇంకా చిత్ర బృందం మాట్లాడారు.